ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

(34)

## (దిరుసుమర్రులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 3-3-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఆధ్యాత్మికమార్గంలోగాని, భౌతిక జీవితంలోగాని అభివృద్ధిలోనికి రావాలంటే (1) ఆత్మవిశ్వాసము (2) క్రమశిక్షణ ముఖ్యము. దేవునికంటే కూడా ముందు మనమీద మనకు విశ్వాసం ఉండాలి. ఆత్మవిశ్వాసం లేనివాడు జీవితంలో చాలా నష్టపోతాడు. మనిషికి తనమీద తనకు విశ్వాసం లేకపోతే ఇతరులు మాట్లాడే మాటలకు, విమర్శలకు ఎక్కువ కంగారుపడతాడు. మానసికరుగ్మతకు గురి అవుతాడు. ఈ జీవితంలో గాని అంటే ఈ శరీరం ఉండగాగాని, శరీరం మరణించిన తరువాత జీవితములో గాని మనం స్థిరంగా, శాంతిగా ఉండాలంటే ఆత్మవిశ్వాసము, క్రమశిక్షణ ఇవి రెండూ చాలా ముఖ్యము.

జ్ఞానంలో రెండు రకాలు (1) ఆత్మజ్ఞానము (2) భౌతికజ్ఞానము. భౌతికజ్ఞానమునే సాపేక్షజ్ఞానము అంటారు. ప్రాపంచిక విషయములను మనస్సుతో సేకరిస్తాము. దీనిని సాపేక్షికజ్ఞానము అంటారు. ఇది జీవితం బాగా వెళ్ళటానికి ఉపయోగపడుతుంది గాని మోక్షసుఖమును సాపేక్షికజ్ఞానము ఇవ్వలేదు. మన హృదయంలో చావులేనిస్థితి ఒకటి ఉంది. అది వ్యవహారిక సత్యం కాదు. అది పారమార్థిక సత్యం. ఆత్మజ్ఞానము ఆత్మను పట్టి ఇస్తుంది.

నీ హృదయంలో ఒక సత్యము ఉంది. అది మనం నిద్రపోతున్నప్పుడు కూడా నిద్రపోకుండా మెలుకువగా ఉంది. అది తలంపులు లేనపుడు కూడా ఉంది. సత్యం అనేది నీ తలంపులమీదగాని, నీ రాగద్వేషములమీదగాని ఆధారపడిలేదు. అది స్వతంత్రమైనది. మనకు ఎప్పుడైనా సుఖం వస్తుంది. అదీ తలంపే. దుఃఖం వస్తుంది. అదీ తలంపే. ఈ శరీరం ఏదో రోజు మరణిస్తుంది. అదీ తలంపే. మొత్తం అన్ని తలంపులుకూడా అసత్యములే. ఒక్క తలంపుకూడా నిజంకాదు. అది నిజం అని మనం అనుకోవటంవలన ఆ తలంపుయొక్క పరిధికి లోబడిపోతున్నాము. నేనుఅది నేనుఇది అని అనుకొంటాను అనుకోండి. అక్కడ పరిమితి వచ్చేస్తుంది, బంధింపబడతాను. అది అనుకొన్నా ప్రమాదమే. ఇది అనుకొన్నా ప్రమాదమే. మనం ఏదైతే కాదో అది అనుకొన్నంతకాలము పరిమితులు తప్పవు.

కృష్ణుడు దేవుడు అంటున్నారు. కృష్ణుడు చెప్పినట్లు చేయమంటున్నారు. కాని కృష్ణుడు చెప్పిన మాటలకంటే మా ఆయన చెప్పిన మాటలు నాకు నచ్చుతున్నాయి. కృష్ణుడు దేవుడు అయితే కృష్ణుడు చెప్పిన మాటలు నచ్చాలికదా. నాకు మా ఆయన చెప్పినట్లుగా చేయాలని ఉంటోందిగాని కృష్ణుడు చెప్పినట్లుగా చేయాలని నాకు ఉండటంలేదు. దీనికి కారణం ఏమిటి? అని ఒక అమ్మగారు అడిగారు. దీనికి కారణం మీ ఆయనమీద మీకు ఉన్న మోహం. కృష్ణుడుమీద నీకు ప్రేమ లేదు. భక్తి లేదు. అందువలన కృష్ణుడు చెప్పినట్లుగా చేయాలని నీకు అనిపించదు. కృష్ణుడు చెప్పిన మాటకంటే మీ ఆయన చెప్పిన మాట తియ్యగా ఉంది అంటే కృష్ణుడు చెప్పినమాట అసత్యం, మీ ఆయన చెప్పిన మాటలు సత్యం అని కాదు. కేవలము నూటికి నూరు పాళ్ళు నీ భర్తమీద ఉన్న మోహంవలన ఆయన చెప్పిన మాట సత్యం అనుకొంటున్నావు. దేవుడు చెప్పిన మాటలు అసత్యం అనుకొంటున్నావు. అంతకంటే ఏమీ లేదు.

ప్రకృతి మనుషులు చెప్పిన మాటలు నిజం అనుకోవటానికి భగవంతుడు చెప్పిన మాటలు అసత్యం

అనుకోవటానికి కేవలము మోహమే కారణము. ద్వైతమే కారణము. ఎక్కడైతే ద్వైతం ఉందో అక్కడ మాయ ఉంది, అక్కడ అజ్ఞానం ఉంది, అక్కడ కామం పుడుతుంది, అక్కడ ఆశపుడుతుంది, అక్కడ భయంపుడుతుంది. ద్వైతము లేకుండా మాయలేదు. ద్వైతము సత్యముమీద ఆధారపడిలేదు. మాయమీద ఆధారపడి ఉంది. మాయ నశిస్తే ద్వైతము నశిస్తుంది.

దేవుడు ఎక్కడో దూరన ఉన్నాడు అని మనం అనుకొంటున్నాము. ఎందుచేతనంటే దేవుడికి సంబంధించిన అవగాహన మనకు లేదు. కాని దేవుడు మన హృదయంలోనే ఉన్నాడు. మనం గర్వం తెచ్చుకోకుండా భగవంతుడు ఇచ్చిన శక్తులను సద్వినియోగం చేసుకొంటూ ఉంటే, ఈ ప్రపంచము అంతా ఆయన ఆలయమే అనుకొంటూ ఉంటే, ఏ మనిషిని చూసినా భగవంతుని రూపమును చూస్తున్నట్లుగా అటువంటి భావనలో ఉంటే, అద్వైతభావనను పెంచుకొంటే భగవంతుడు ఎంతలోతులలో ఉన్నాడో ఆ లోతులలోనికి మనలను ఆయనే తీసుకొనిపోతాడు. ఆయన అనుగ్రహం ఉంటే ఇంకో గంటలో మనకు దేవుడు తెలియవచ్చు. ఎప్పుడోకాదు, రేపుకాదు, రాబోయే జన్మలో కాదు ఇంకో గంటలో మనకు దేవుడు తెలుస్తాడు ఆయన ఎక్కడనుండో రానక్కరలేదు. ఆయన మనహృదయంలోనే ఉన్నాడు. మనం విర్రవీగకుండా ఉంటే, అణకువగా ఉంటే, భగవంతుడు చెప్పిన మాటయందు గౌరవము కలిగి ఉంటే ఈశ్వరుడే మనలను పట్టుకొని ఆయన ఎక్కడ ఉన్నాడో అక్కడకు లాగుకొనిపోతాడు. ఈ నిమిషంలోనే లాగుకొనిపోతాడు. మీరు ఏ పనిచేసినా గొప్పలకోసం వెళ్ళకండి. ఎక్కడో ఏదో ఉంది అని భ్రాంతిపడకండి. ఉన్నదంతా హృదయంలోనే ఉంది.

మనం ఏదైనా పని చేసేటప్పుడు అది సహజంగా చేయాలి, నిర్మలంగా చేయాలి. ఫలం ఏదో రోజు వస్తుంది. ఫలం వచ్చినపుడు గర్వంరాకూడదు. ఫలం రాకపోతే నిరాశ చెందకూడదు. గర్వం కూడా వికారమే. నిరాశకూడా వికారమే. మీకు సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా అవి నిజం కాదు. అవికూడా వికారములే. మీకు వచ్చేపొంగూ, కృంగూ కూడా వికారములే. ఈ సబ్జెక్టును సరిగా అర్థం చేసుకొంటే మనస్సు చల్లబడుతుంది. వస్తువు స్వరూపము మీకు తెలుస్తుంది. మనస్సుకు ఏకాగ్రత వచ్చేకొలది, మనస్సుకు చల్లదనం వచ్చేకొలది భగవంతుడు ఈ మనస్సును ఆయనే గుంజుకొని తీసుకొనిపోతాడు. ఆయన ఎంతలోతులలో ఉన్నాడో అక్కడకు ఈ మనస్సును తీసుకొనిపోయి, ఈ మనస్సును కరగబెట్టి ఆయన స్వరూపమును ఇచ్చేస్తాడు. జ్ఞానం రావటం ఒక్కక్షణంలో వచ్చేస్తుంది. ప్రిపేర్ అవ్వటానికి టైమ్ పడుతుంది. భగవంతుడు ఇప్పుడుకూడా వ్యక్తమవ్వటానికి రెడీగానే ఉన్నాడు. మనం తట్టుకోలేమని Wait చేస్తున్నాడు. ఒక లక్షరూపాయలు లాటరీ తగిలితేనే తట్టుకోలేము. భగవంతుడు వ్యక్తమయితే ఆకాంతిని, ఆనందమును మీరు భరించలేరు. మీ మనస్సు ప్రిపేర్ అవ్వటానికి ఆయన చూస్తున్నాడు. ఆయన Wait చేయాలని చేయటంలేదు మనకు అర్హత, యోగ్యత రాలేదు అని ఆయన చూస్తున్నాడు. యోగ్యత వచ్చిన మరుక్షణంలో ఆయన వ్యక్తమవుతాడు.

మనం ఏ రంగములో ఉన్నా మనం ఎంతవరకూ పవిత్రం అవుతున్నామో అది చూసుకోవాలి. Purification వలన realization వస్తుంది. ఏ వృత్తి చేస్తున్నారు అన్నది ముఖ్యం కాదు. ఏ దేవుడిని ఆరాధిస్తున్నారు అన్నది ముఖ్యం కాదు. కొంతమంది మతాలు మార్చుకొంటూ ఉంటారు. అది కూడా పొరపాటు. ప్రలోభానికి లోనుకావద్దు. మహిమలకు లోనుకావద్దు. ప్రలోభాలకు లోనుఅవుతూ ఉంటే మనం చాలా బలహీనులము అని అర్థం. నీకు సైన్సు బాగా రావచ్చు. లెక్కలు బాగా రావచ్చు. మంచిదే. ఇవి అన్నీ మనస్సుకు సంబంధించినవి. ఈ నాటికి కాకపోయినా ముందునాటికైనా వీటిని దాటాలి. అంటే సాపేక్షికజ్ఞానమును దాటి నువ్వు ఆత్మజ్ఞానమును సంపాదించటానికి ప్రయత్నం చేయాలి. నీవు ఆత్మలో స్థిరపడాలి. దేహబుద్ధి ఇప్పుడు నీకు ఎంత సహజంగా ఉందో ఆత్మబుద్ధి అంత సహజంగా నీకు కలగాలి. పరిమితులు పెట్టుకోవద్దు. పరిమితులనుండే దుఃఖము వస్తుంది.

మీమీద మీరు నమ్మకంపెట్టుకొని పనిచేయటం ప్రారంభించండి. అప్పుడుకూడా మిమ్మలను విమర్శించేవారు విమర్శిస్తూనే ఉంటారు. కారు వెళుతూ ఉంటే వెనుక దుమ్ము వస్తుంది. ఆ దుమ్మును చూసి జడిసేవారు ఇంక ప్రయాణం చేయలేరు. అలాగే మీరు ఏదైనా మంచిపని చేస్తూఉంటే వెనుక ఎవరైనా విమర్శిస్తూ ఉంటే ఆ విమర్శను చూసి కంగారుపడతూ ఉంటే మీపని సున్న. జీవితంలో మీరు ఓడిపోతారు. కాన్ఫిడెన్స్ ముఖ్యం. దేవుడిమీదకంటే ముందు మీ మీద మీకు విశ్వాసం ఉండాలి అని స్వామీజీ చెప్పేవారు. మన స్వంతబలం మీద మనం నిలబడగలగాలి. ఎవడికైతే స్వంతబలం లేదో, ఎవడికైతే ఆత్మవిశ్వాసము లేదో, ఎవడికైతే స్థిరత్వం లేదో వాడు ఇతరులయొక్క కుయుక్తులకు కంగారుపడి జీవితంలో ఫెయిలవుతాడు. అందువలన మనం ఆత్మవిశ్వాసమును పెంచుకొని పనిచేయాలి.

గాఢనిద్రలోనుండి మెలుకువలోనికి వచ్చినపుడు నేను అనే తలంపు వచ్చి దేహంతో తాదాప్యం పొందుతుంది. దానిని విడదీయలేకపోతున్నాము. దేహముతో తాదాప్యం పొందిన నేనుకంటే మనస్సుతో తాదాప్యం పొందిన నేనును విడదీయటం చాలా కష్టం. మీకు కాలు ఎక్కడైనా విరిగింది అనుకోండి. కట్టు కట్టించుకొంటారు. కొన్ని రోజులు మంచంమీద ఉంటే తగ్గిపోతుంది. మిమ్ములను ఎవరైనా తిట్టారు అనుకోండి. కొన్నిరోజులు కాదు కదా చనిపోయేవరకూ జ్ఞాపకంపెట్టుకొంటారు. మనస్సుతో కలసిఉన్న నేనులోనుండి విడుదల పొందటం చాలా కష్టం అందువలన సాధన అంతా అక్కడే కేంద్రీకరించాలి.

మీలోపల ఉన్న అబద్ధమైన నేనుతో మీరు కలసిఉంటున్నారు. దానితో సహవాసం విడిచిపెట్టటం లేదు. అబద్ధమైన నేను ఎలా వ్యక్తమవుతోంది అంటే అదే మీరు అనుకొంటున్నారు. అది మీరు కాకపోయినా అదే మీరు అనుకొంటున్నారు. ఎందుకు అలా అనుకొంటున్నారు అంటే అలవాటుయొక్క వేగమునుబట్టి అలా అనుకొంటున్నారు. ఈ అలవాట్లలోనుండి విడుదల పొందటానికి గురువు అనుగ్రహము అవసరము. గురువు అంటే ఎవరు? మీరు ఏ వస్తువును తెలుసుకోవటానికి ప్రయత్నంచేస్తున్నారో, ఏ వస్తువు యొక్క అనుభవం సంపాదించటంకోసం ప్రయత్నం చేస్తున్నారో ఆ వస్తువు అయి ఉన్నవాడు గురువు. అనుకొని చెప్పటం వేరు. అందులో ఉండి చెప్పటం వేరు. ఆ వస్తువుగురించి ఊహించటానికి ప్రయత్నంచేయవద్దు. అది అవ్వటానికి ప్రయత్నంచెయ్యి అని భగవాన్ అంటూ ఉండేవారు.

మీలోపల ఉన్న సత్యవస్తువుకు పుట్టుకలేదు. చావులేదు. దేహాన్ని ఇక్కడే కాల్చేస్తున్నారు. ఇంక పుట్టేవాడు ఎవడు? మీలో ఉన్నగుణాల సముదాయమే పుడుతుంది. మీలో ఉన్న అలవాట్లయొక్క సమూహమే పుడుతుంది. అలవాట్లు, తలంపులు, గుణాలు ఇవి అన్నీ ఒకమాట. ఈ మాటనే వేదాంతపరిభాషలో జీవుడు అంటారు. గడ్డితాడులో ఉన్న గడ్డిపరకలను ఒకోదానిని తీసివేస్తే గడ్డితాడు ఉండదు. అలాగే నీ అలవాట్లను, గుణాలను ఒకోదానిని తీసివేస్తే జీవుడనే వాడులేడు. నీవు విచారణచేస్తేవాడు పోతాడు. నీవు విచారణ చేయకపోతే వేయిజన్మలు అయినా నేను ఉన్నాను అంటాడు. మోక్షకాంక్ష ఎవరిలో అయితే తీవ్రంగా ఉందో వారిలో ఈ గుణాలు నశిస్తాయి.

మనం అస్తమానూ గుణాలను తలపెట్టుకోకూడదు. మీకు ఇష్టంలేనివారు ఎవరైనా ఉంటే వారిని తలపెట్టుకోకూడదు. ఇష్టంలేనివారిని తలపెట్టుకొంటాము. కోపాలు తెచ్చుకొంటాము. దేవుడు అలా తలపెట్టుకోమని చెపుతున్నాడా? లేదు. ఇంటిదగ్గర కూర్చొని ఇష్టంలేనివారిని తలపెట్టుకొనేది మీరే. వారు జ్ఞాపకం వచ్చేటప్పటికి కోపం వస్తుంది. కోపం వాడి మీద react అవుతుంది. ఈ గొడవలు నాకు సంబంధం ఏమిటి అంటున్నాడు భగవంతుడు. అక్కరలేని గొడవలు తలపెట్టుకొనేది మీరే. అలా తలపెట్టుకొన్నప్పుడు మీ మనస్సులో వికారం వస్తుంది. అప్పుడు reactఅవుతాము. ఇలా react అయినపుడు కొత్త వాసనలు వస్తాయి. రోడ్డుమీద ఉన్న దుమ్ము అంతా ముఖానికి రాసుకోవటం మరల కడుక్కోవటం. దుమ్ము ముఖానికి ఎవరు రాసుకోమన్నారు. మరల సబ్బులు అరిగేలా ఎవరు కడుక్కోమన్నారు. ఈ పెంట అంతా మీరే నొల్లుకొని నా

మీద పెడతారు ఏమిటి? అంటున్నాడు భగవంతుడు. ఈ గొడవలు అన్నీ ఎవరు మిమ్మలను తలపెట్టుకోమన్నారు. తలపెట్టుకొన్న తరువాత వికారము వస్తోంది గాని తలపెట్టుకోకముందు వికారం రావటంలేదు కదా. ఈ వికారములు ఎవడు తెచ్చుకోమన్నాడు. మరల ఈ వికారములు ఎలా పోగొట్టుకోవాలి, సాధన ఎలా చెయ్యాలి అనే గొడవలలోనికి వెళ్ళటం ఈ గొడవలు అన్నీ మీరే కల్పించుకొంటున్నారు. ఈ గొడవలు అన్నీ వదిలేసి నన్ను జపిస్తే, నన్ను ధ్యానిస్తే, ఏది కావాలి అనుకొంటున్నారో దానినే మీరు తలపెట్టుకొంటూ ఉంటే అక్కరలేనివి పోతాయి.

భగవంతుని వదిలేసి ప్రకృతి గొడవలు తలపెట్టుకొంటూ సాధనచేయాలంటే దూడను వెనకాల కొడుతూ తీసుకొనివెళితే ఎంత కష్టంగా వెళుతుందో అంత కష్టంగా ఉంటుంది. అలా కాకుండా పచ్చగడ్డిని చూపించారు అనుకోండి, దానికోసం మనకూడా వచ్చేస్తుంది. నడిచినట్లే దానికి తెలియదు. దాని దృష్టి అంతా పచ్చగడ్డిమీద ఉంటుంది. భగవంతుని గుణాలను తలపెట్టుకొంటూ, భగవంతుని స్మరిస్తూ ఉంటే పచ్చగడ్డి చూపించినపుడు దూడ ఏ విధంగా అయితే నడుస్తుందో అలాగ మీ మనస్సు భగవంతునివైపుకు ప్రయాణం చేస్తుంది. అలసటచెందరు. గమ్యానికి వెళ్ళిపోతారు. వెనకాల కర్రపెట్టి కొట్టుకొని వెళ్ళటం అంటే ప్రకృతి గొడవలలో ఉంటే మీరు అలసట చెందుతారు. చివరకు గమ్యానికి వెళ్ళలేరు. అందువలన భగవంతుడు ఏమని చెపుతున్నాడు అంటే ఇంటిదగ్గర కూర్చొన్నప్పుడు నా గుణాలగురించి చెప్పుకోండి. నా మాటలు చెప్పుకోండి, నా జ్ఞానం యొక్క వైభవంగురించి చెప్పుకోండి. అలా చెప్పుకోగా, చెప్పుకోగా నామీద ఆకర్షణ కలుగుతుంది. ఆకర్షణ వలన మీకు ప్రయాణం తేలికగా ఉంటుంది. Safeగా గమ్యమును చేరగలరు. Negitiveగా ఆలోచించేబదులు Positiveగా ఆలోచించి గమ్యాన్ని పొందండి అని చెపుతున్నారు.

మీరు ఇక్కడే ఆశ్రమంలోనే ఉంటున్నారు. గ్రామాలకు వెళ్ళి సభలు పెట్టి ఎందుకు భోదించటం లేదు అని భగవాన్‌ను ఎవరో అడుగుతున్నారు. నేను భోదించటం లేదు అని నీకు ఎలా తెలుసు అన్నారు భగవాన్. భోద అంటే ఒక స్టేజిమీద కూర్చొని చుట్టూ కొంతమంది జనాన్ని పెట్టుకొని నిరంతరముగా మాట్లాడటం కాదయ్యా అని చెపుతున్నారు. భోదించటం అంటే నా భావాలను ఇతరులకు అర్థమయ్యేలా చెప్పటం. నీవు ఏమంటున్నావు అది మాటలలో చెప్పమంటున్నావు. నాలో ఉన్నదానిని ఎదుటివాడికి మాటలతో సంబంధం లేకుండా మౌనంతో కూడా చెప్పే శక్తి ఒకటి ఉంది అని నీకు తెలియటం లేదు. మాటే Teach చేస్తుంది అనుకొంటున్నావు. మౌనం కూడా Teach చేస్తుంది. మౌనం కూడా భోదిస్తుంది అని నీకు తెలియక ఈ ప్రశ్న అడుగుతున్నావు. గంటలకొలది ఈ ఉపన్యాసములు విని ఏ విధంగానూ ప్రభావితం కాకుండా అంటే ఈ విన్నమాటయొక్క ప్రభావము వినేవారి మీద పడకుండా ఈ ఉపన్యాసము విన్నాము. జీవితమును ఇలా సంస్కరించుకోవాలి రేపటినుండి మనం మారు జీవితమును పొందాలి అని లోపలనుండి మార్పు రాకుండా గంటలతరబడి ఉపన్యాసములు విని వెళ్ళిపోతారు అనుకోండి. అలా కాకుండా ఎవడైనా నా దగ్గరకు వచ్చాడు అనుకోండి. వాడికి నేను మాటలతో చెప్పను. వాడికి ఉన్న సంస్కారములనుండి, చెడు అలవాట్లనుండి విడుదల పొందాలి అని నా మౌనంవలన వాడికి కలిగింది అనుకోండి. ఇక్కడ ఉపన్యాసము పనిచేస్తోందా? మౌనం పనిచేస్తోందా? నీవే నిర్ణయించుకో. Subject చెప్పి వదలివేస్తారు. ఇలా చెయ్యి అని ఎవరినీ బలవంతం పెట్టే అలవాటు భగవాన్‌కు లేదు.

ఉపన్యాసములా నీకు కావలసింది. లేక నిర్మలంగా ఉండి, నిరహంకారముగా ఉండి, నిశ్శబ్దంగా ఉండి ఎవడైతే తన దగ్గరనుండి శక్తిని పొందుతున్నాడో వాడికి కూడా తెలియకుండా మౌనం ద్వారా ఆ శక్తిని వాడిలో ప్రవేశపెట్టటం ముఖ్యమా. ఏది మంచిదో నీవే ఆలోచించుకో. ఉపన్యాసములు చెప్పవద్దని ఆయన చెప్పటంలేదు. మాటకు శక్తి లేదు అని ఆయన చెప్పటంలేదు. మాట ఎక్కడనుండి వచ్చింది. తలంపులోనుండి వచ్చింది. తలంపు ఎక్కడనుండి వచ్చింది. నేనులోనుండి వచ్చింది. ఆ నేను ఎక్కడనుండి వచ్చింది.

చైతన్యంలోనుండి వచ్చింది. మాటకే ఇంత శక్తి ఉంటే చైతన్యమునకు ఎంత శక్తి ఉంటుంది. ఆ చైతన్యమే అయిఉన్నవాడిదగ్గర ప్రభావం పొందకుండా ఎలా బయటకు వెళ్ళగలవు. నిప్పుదగ్గర కూర్చొని వేడి తగలకుండా ఎలా ఉండగలము. అదే విధంగా చైతన్యస్థాయిలో ఉన్నవాడిదగ్గర కూర్చొని వాడి ప్రభావం ఎంతో కొంత పడకుండా నీవు తప్పించుకోలేవు.

ఈ ఉపన్యాసములు వినటంకంటే, పూజలకంటే, జపాలకంటే, ధ్యానాలకంటే గురువు అనుగ్రహము అత్యంత బలీయమైనది. ఎందుచేతనంటే నీవు ఏ వస్తువును పొందాలి అని అనుకొంటున్నావో గురువు ఆ వస్తువై ఉన్నాడు. నీవు చేసే సాధనకంటే గురువు అనుగ్రహం చాలా బలీయమైనది. భగవాన్ దగ్గర ఎవరైనా పాదనమస్కారములు చేసినా అంత గొడవ ఎందుకు Subject సరిగా అర్థంచేసుకోవటానికి ప్రయత్నించండి అనేవారు భగవాన్. జ్ఞాని దగ్గరకు వెళ్ళి నమస్కారములు పెట్టినా, పెట్టకపోయినా వాడికి ఏమీ అనిపించదు. జ్ఞానిఅంటే ఆత్మ. ఆత్మకు ఇతరులు లేరు. అందువలన ఇతరులు గౌరవించాలి అనే భావన అక్కడ ఉండదు. భోదవలన ఏమీ ఉపయోగం లేదు అని నేను అనటం లేదు. భోదకంటే మౌనం శక్తివంతమైనది, అతి బలీయమైనది. భోదకు ఏమీ విలువ లేదు అని నేను చెప్పటం లేదు. మౌనంలో ఎక్కువ శక్తి ఉంది. ఏదో నీవే నిర్ణయించుకో.

అందరూ నిద్రపోతున్నాముకదా. మరల ఉదయం 4గంటలకో, 5గంటలకో మెలుకువ వచ్చేస్తోంది కదా. అలా మెలుకువ రాకుండా 4నెలలు నిద్రలోనే ఉంటే బాగుంటుంది. అలా 4నెలలు నిద్రలో ఉండాలని నాకు ఉంది అని భగవాన్‌ను అడుగుతున్నారు. నీవు నిద్రలో ఉండాలి అంటున్నావు. నీకు మెలుకువలో కూడా ఆ నిద్ర సాగుతూనే ఉంది అంటున్నారు భగవాన్. గాఢనిద్రలో నీవు ఏ స్థితిలో ఉన్నావో ఆ స్థితి ఇప్పుడు కూడా సాగుతూనే ఉంది. జాగ్రత్తగా విచారణ చేసి దానిని పట్టుకొన్నావా నీవు జ్ఞానివి అవుతావు. నీవు సాధనచేసి మెలుకువలో నిద్రా స్థితిని అనుభవంలోనికి తెచ్చుకుంటే నీవు జ్ఞానివి అవుతావు. అసలు పొందవలసిన స్థితి అదే.

నిజంగా లోనికి వెళ్ళటంగాని, వెలికి రావటంగాని ఏమీ లేదు. దేహబుద్ధి ఉన్నవాడు లోనికి వెళ్ళాను అనుకొంటాడు. బయటకు వచ్చాను అనుకొంటాడు. దేహబుద్ధి లేనివాడికి బయట లేదు, లోపలా లేదు. భగవాన్ స్కందాశ్రమంలో ఉండగా కొంతమంది భక్తులు ఆయనతో మీరు ఎంతసేపు మాతోనే ఉంటున్నారు. కొంతసేపు లోపలికి వెళ్ళి ధ్యానం చేసుకోండి అని అంటూ ఉండేవారు. అయితే ఇప్పుడు నేను బయట ఉన్నానా అన్నారు భగవాన్. లోపల ఉన్నవాడు బయటకు వస్తాడు. బయట ఉన్నవాడు లోపలికి వెళతాడు. బ్రహ్మానుభవం పొందినవాడికి లోపల లేదు, బయట లేదు.

బయట శుభ్రంచేసుకో, లోపల శుభ్రం చేసుకో అని కృష్ణుడు గీతలో చెప్పాడు. మనం ఎలా ఉన్నా గొడవ లేదు. సాధన చేసేవారికి చెపుతున్నాడు. సబ్బుపెట్టి మీ శరీరమును బాగానే కడుక్కొంటున్నారు. ఇంక లోపల ఎలా కడగాలి? భగవంతుని నామము స్మరించటంవలన, భగవంతుని గుణాలను తలపెట్టుకోవటంవలన మనస్సుకు స్నానం చేయించినట్లు అవుతుంది. నీ శరీరానికి స్నానంవద్దు అని ఆయన చెప్పటం లేదు నీ శరీరానికి స్నానం చేయించాలి. నీ మనస్సుకు స్నానం చేయించాలి అంటున్నారు. లోపల స్నానం వలన నీ హృదయంయొక్క లోతులు తెలుస్తాయి. బయట స్నానం ఎప్పుడైనా మర్చిపోయినా లోపల స్నానం మర్చిపోకుండా ఉంటే నీ హృదయంలో ఉన్న విలువైన ముత్యాలు, బంగారం నీ చేతికి అందుతుంది. అందరికీ బంగారం కావాలి. కాని తన మనస్సును బంగారం క్రింద చేసుకోవటానికి ఎవడూ ప్రయత్నం చేయటంలేదు అని ఒక మహాత్ముడు చెప్పారు. బంగారంమీద మనకు ఎంత మోజు ఉందో అలాగ మన మనస్సును బంగారం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తే భగవంతుడు ఆయన స్వరూపమును

ఇస్తాడు. నీవు పదిసార్లు సబ్బుపెట్టి తోమేబదులు ఒక్కసారి అయినా భగవంతుని జ్ఞాపకంపెట్టుకొంటే నీవు సత్యానికి దగ్గరవుతావు. బాహ్యస్నానం అవసరమే. బయట స్నానంకంటే లోపల స్నానం వలన నీకు ఎక్కువ బంగారం దొరుకుతుంది. లోపల శుద్ధి అవసరమే. బయటశుద్ధి అవసరమే. ఎవడికైతే లోపల శుద్ధి ఉందో వాడికి స్థిరత్వం వస్తుంది. ఎవడికైతే స్థిరత్వం ఉందో వాడికి సహనం వస్తుంది. మనిషికి సహనం వచ్చేకొలది హృదయంయొక్క లోతులు పెరుగుతాయి.

రోజూ ఉదయమే మెలుకువ వచ్చేస్తోంది, 4నెలలు నిద్రపోవాలి అని అడుగుతున్నాడు. భగవాన్ ఏమని చెపుతున్నారు అంటే నీలో ఉన్న మాయ, నీలో ఉన్న అలవాట్లు, నీలో ఉన్న వాసనలు నిన్ను బలవంతంగా లేపేస్తాయి అంటున్నారు. నీకు ఇష్టంలేకపోయినా నీ అలవాట్లు ఉన్నాయి కదా అవి నిన్ను మెలుకువలోనికి తీసుకొనివచ్చేస్తాయి. నీకు నిద్రపోవాలి అని ఉంది. గాని నీ అలవాట్లు నిద్రలోనుండి నిన్ను మెలుకువలోనికి తీసుకొనివచ్చేస్తాయి. భగవాన్ ఎంత ముద్దుగా చెపుతున్నారో చూడండి. ఎంత డైరక్టుగా చెపుతున్నారో చూడండి. నిద్రలోనుండి మెలుకువలోనికి రావటానికి కారణము పురాణములలో ఇలా ఉంది, శాస్త్రములలో అలా ఉంది అని ఆయన చెప్పటం లేదు. నీ అలవాట్లు నిన్ను మెలుకువలోనికి తీసుకొనివచ్చేస్తాయి అంటున్నారు. ఆయన అనుభవంలోనుండి తీసి చెప్పటమే. అహంవృత్తి నిన్ను బలవంతంగా లేపేస్తుంది. ఎవడైతే తన శక్తినంతా ఉపయోగించి అహంవృత్తిని దాని మూలంలోనికి త్రొక్కి అణిచివేస్తున్నాడో వాడే తెలివైనవాడు అని భగవాన్ చెపుతున్నారు. సాధన చేసేవాడినికూడా, ఎవడైతే అహంవృత్తిని దాని మూలంలో అణచి ఉంచటానికి ప్రయత్నం చేస్తున్నాడో వాడినికూడా మాయచేసి అహంవృత్తి విజృంభించటానికి ప్రయత్నంచేస్తుంది. అంత బలీయమైనది. దాని వయస్సు ఎక్కువ. మన సాధనయొక్క వయస్సుచాలా తక్కువ. సాధన చెయ్యనివాడి గొడవ వదిలివెయ్యండి. అహంవృత్తిని తొలగించుకోవటానికి ఎవడైతే ప్రయత్నం చేస్తున్నాడో వాడినికూడా ఇబ్బంది పెట్టి అది విజృంబించటానికి ప్రయత్నం చేస్తుంది. లోపలఉన్న అలవాట్లవేగము దానిని బయటకు తీసుకొని వచ్చేస్తుంది.

జ్ఞానికి కూడా మనస్సు ఉంటుంది. అది పగటిచంద్రుడు లాంటిది. పగలుకూడా చంద్రుడు ఉంటాడు. కాని వాడి ప్రభావం ఏమీ ఉండదు. అలాగే జ్ఞానికి మనస్సు ఉంటుంది. గాని దాని ప్రభావం ఏమీ ఉండదు. ఎందుచేతనంటే మనస్సు ఎక్కడయితే ఉదయించి వస్తోందో దాని మూలంలోనే వాడు ఉన్నాడు కాబట్టి అది విజృంభించదు. అది మృత మనస్సు. అది కాలిన తాడువంటిది. మీ నామములు, రూపములు జ్ఞాని గుర్తిస్తున్నాడు కదా అయినా మీ నామములుగాని, మీరూపములుగాని, మీ ఆర్థిక స్థితులుగాని, మీ పదవులుగాని, మీ గౌరవాలుగాని చూసి ఆయన వ్యామోహపడడు. నామరూపములు అన్నీకూడా జ్ఞానికి నీడలుగా కనబడతాయి.

మనకు ఏదైనా వినాలని అనిపిస్తోంది అనుకోండి, చూడాలని అనిపిస్తోంది అనుకోండి, ఏదైనా తెలుసుకోవాలి అనిపిస్తోంది అనుకోండి వాడికి జ్ఞానం లేదు అని గుర్తు. బ్రహ్మానుభవం పొందినవాడికి చూడటానికి ఏమీ లేదు, వినటానికి ఏమీ లేదు. ఉన్నది తానే. తనను తాను ఏమి చూసుకొంటాడు. బ్రహ్మానుభవం పొందితేగాని ఈ మాటలుయొక్క అర్థంకూడా మనకు తెలియదు. దేనినైతే పొందాలి అనుకొంటున్నావో, దేనినైతే సాధించాలి అనుకొంటున్నావో అక్కడే లక్ష్యాన్ని పెట్టు, అక్కడే నీ దృష్టిని పెట్టు, నీ ప్రేమను కూడా అక్కడే పెట్టు. సముద్రంలో ఉప్పు బొమ్మ ఏవిధంగా అయితే కరిగిపోతుందో అదే విధంగా నీవు ఏ లక్ష్యమునందు నీ మనస్సును పెడుతున్నావో ఆ లక్ష్యమునందు నీ మనస్సు కరిగిపోతుంది. ఏ వస్తువునయితే పొందాలి అనుకొంటున్నావో ఆ వస్తువునందు నీ మనస్సును నిలబెట్టి ఉంచితే ఆ వస్తువును పొందుతావు. విషయచింతనవలన మనం లక్ష్యానికి దూరమవుతాము. లక్ష్యమువైపుకు ప్రయాణం చేస్తూ ఉంటే విషయచింతనకు దూరమవుతాము.

***